క్లుప్తంగా

గద్దర్ చిరస్మరణీయుడు

ప్రకాశం నగర్: తన ఆటపాటల ద్వారా దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చిన గుమ్మడి విఠల్ రావు (గద్దర్) చిరస్మరణీయుడు అని బీఎస్పీ నాయకుడు ఇసుకపట్ల రాంబాబు అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో బుధవారం గద్దర్ సంస్మరణ సభ ఘనంగా నిర్వహించారు. రాంబాబు మాట్లాడుతూ గద్దర్ మరణం అణగారిన వర్గాలకు తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వి.చిట్టిబాబు, ప్రసాద్, సంజీవరావు, జార్జి అంథోని, సుబ్బారావు పాల్గొన్నారు.

వైద్యశిబిరం



శిబిరం ప్రారంభోత్సవంలో పాల్గొన్న జక్కంపూడి విజయలక్ష్మి

ప్రకాశం నగర్: స్థానిక రాజేంద్ర నగర్‌లోని బిలాల్ షాదీఖానాలో ఆల్ హుదా సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ ఖాజీ మౌలానా కరీముల్లా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎండీ రషీద్ ఖాన్, బొంత శ్రీహరి, బాబ్జీ, సమీ, జలీల్ పాల్గొన్నారు.

కార్మిక సంఘాల ధర్నా

ప్రకాశం నగర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మిక సంఘాలు, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు లోవ, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ రాంబాబు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. మోదీ ప్రభుత్వంపై కార్మికులు, ఉద్యోగులు పోరాటాలకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జువ్వల రాంబాబు, సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు వి.కొండలరావు, బి.పవన్ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై నిరసన



నిరసన తెలుపుతున్న బ్యాంక్ ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: మణిపూర్‌లో జరుగుతున్న దురాగతాలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని తూర్పుగోదావరి బ్యాంక్ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఆ కమిటీ ఆధ్వర్యంలో ఇన్నీసుపేట యూనియన్ బ్యాంక్ రీజినల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. బ్యాంక్ వేళలు ముగిసిన తరువాత ఈ కార్యక్రమం చేపట్టారు. కమిటీ మహిళ కన్వీనర్ కేవీ స్వాతి మాట్లాడుతూ అమానుష చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగులు కీర్తన, వెంకటక్ష్మి, కేవీ లక్ష్మి పాల్గొన్నారు.

11న కౌలు వేలం

ధవళేశ్వరం: లక్ష్మీజనార్దనస్వామి దేవస్థానానికి సంబంధించి ధవళేశ్వరంలోని 3.68 ఎకరాలకు ఈనెల 11న కౌలు వేలం నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు తెలిపారు. మూడేళ్ల కాలపరిమితికి ధవళేశ్వరం శివాలయంలో ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.5 వేలు దరావత్తుతో పాటు రూ.3 లక్షల సాల్వెన్సీ సర్టిఫికెట్‌తో పాటలో పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పేర్లు నమోదు చేసుకోండి

కడియం: షటిల్ ఆడేందుకు ఆసక్తిగల క్రీడాకారులు కడియం పోలీస్ స్టేషన్ వద్ద పేర్లు నమోదు చేసుకోవచ్చునని పోలీస్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ బుధవారం ప్రకటనలో తెలిపారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం ఆత్యాధునిక షటిల్ కోర్టు ప్రారంభమైందన్నారు. ఈ కోర్టును వినియోగించుకునే ఆసక్తి కల క్రీడాకారులు తమ పేర్లను స్టేషన్ వద్ద నమోదు చేసుకోవాలన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి

రాజమహేంద్రవరం రూరల్: తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. బుధవారం ఆయన నివాసంలో రూరల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నియోజకవర్గ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు పాల్గొన్నారు.

టీడీపీ పోస్టర్ల పంపిణీ

కడియం: మండల కేంద్రమైన కడియంలో టీడీపీ మహాశక్తి కార్యక్రమంలో భాగంగా బుధవారం పోస్టర్లను పంపిణీ చేశారు. ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు వెలుగుబంటి రఘురామ్, పుట్టా అనూరాధ, వనుం సూరిబాబు పాల్గొన్నారు.

గొంతువాపు టీకా.. పశువులకు రక్ష

- వ్యాక్సినేషన్‌తో వ్యాధి నివారణ
- చురుకుగా కార్యక్రమం



కడియం మండలం పొట్టిలంకలో గొంతువాపు వ్యాక్సినేషన్‌ను ప్రారంభిస్తున్న సిబ్బంది (ఫైల్)

కడియం: రైతులకు సాగుతో పాటు అనుబంధ ఆదాయ వనరుగా పాడి పరిశ్రమ సాయపడుతోంది. సాగుకాలంలో పంటను ఏ విధంగా అయితే కనిపెట్టుకుని, ఎప్పుకప్పుడు సస్యరక్షణ చర్యలు చేపడతారో అదే విధంగా పశువులతో కూడా అప్రమత్తత ఎంతో అవసరం. ముఖ్యంగా వివిధ రకాల సీజన్లకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకుంటూ పశువులు, జీవాలను కాపాడుకోవాలి. లేకపోతే రైతుకు ఆర్థిక నష్టం తప్పదు. వర్షాకాలంలో గేదెలు, ఆవులకు గొంతువాపు వ్యాధితో ఇబ్బందులు ఎదురవుతాయి. గోదావరి పరివాహక ప్రాంతాల్లోనే ఈ వ్యాధి ఎక్కువగా కన్పిస్తుంది.

ఎర్రనీరు వచ్చిందంటే..

గోదావరికి ఎర్రనీరు వచ్చిందంటే పశువులకు గొంతువాపు వస్తుందని పాడి రైతుల నమ్మకం. దీంతో పశుసంవర్ధక శాఖ ద్వారా గోదావరి వరదలకు ముందుగానే గేదెలు, ఆవులకు టీకాలు వేసే కార్యక్రమం విస్తృతంగా చేపడుతున్నారు. ఒక్క కడియం మండలంలో 1,39,674 పశువులు ఉంటాయని సంబంధిత శాఖ సిబ్బంది చెబుతున్నారు. గోదావరికి దగ్గరగా ఉండే వేమగిరి, వెంకాయమ్మపేట, బుర్రిలంక, కడియపులంక, పొట్టిలంక గ్రామాల్లో ముందుగా గొంతువాపు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇక్కడ పూర్తయ్యాక దశల వారీగా ఇతర గ్రామాల్లోని పశువులకు కూడా వ్యాక్సిన్ అందిస్తున్నారు. ప్రస్తుతం 70 శాతం వరకూ పశువులకు గొంతు వాపు వ్యాధి రాకుండా టీకాలను అందించినట్లు పశువైద్యులు తెలిపారు.

వ్యాధి లక్షణాలు

పశువులకు గొంతువాపు వ్యాధి వస్తే విపరీతమైన జ్వరం వస్తుంది. దవడ కింద భాగంలో వాపు వస్తుంది. ఈ రెండు లక్షణాలను గుర్తిస్తే వెంటనే సమీపంలోని పశువైద్యులను సంప్రదించాలి. ఒకొక్కసారి తక్కువ ప్రభావాన్నే ఈ వ్యాధి చూపుతుంది. ఒక్కోసారి మాత్రం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అటువంటప్పుడు పశువు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. వ్యాధి లక్షణాలను గుర్తించిన వెంటనే పశువైద్యులను సంప్రదించి, వైద్యం చేయించాలి.

వ్యాక్సినేషన్‌తో సత్ఫలితాలు

గొంతువాపు వ్యాధి తీవ్రతతో గతంలో పశువులు మృత్యువాత పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే నాలుగేళ్లుగా ఏటా జూన్‌కు ముందే గొంతువాపు వ్యాధి నిరోధక టీకాలను వేసే కార్యక్రమం పక్కాగా అమలు చేస్తున్నారు. దీంతో వ్యాధి వాప్తి బాగా తగ్గిపోయింది. అంతే కాకుండా వ్యాధి తీవ్రత కూడా అంతగా ఉండడం లేదని రైతులు, పశువైద్యులు కూడా చెబుతున్నారు. ఏది ఏమైనా పశు సంపదను కాపాడుకునేందుకు ముందు జాగ్రత్తగా వ్యాక్సిన్ వేయించాలి.

> **70 శాతం వరకూ పూర్తి**
>
> గోదావరి ఒడ్డున ఉన్న గ్రామాలతో పాటు, కడియం మండలంలో ప్రస్తుతం 70 శాతం వరకూ పశువులకు గొంతువాపు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. ఏటా వరద కంటే ముందే ప్రణాళికాబద్ధంగా ఈ వ్యాక్సిన్‌ను వేస్తున్నారు. దీంతో ఈ వ్యాధి తీవ్రత బాగా తగ్గిందనే చెప్పాలి. ఒకవేళ ఎక్కడైనా పశువులకు అధిక జ్వరం, దవడ క్రింది భాగంలో వాపు, ఊపిరితీసుకోవడంలో ఇబ్బందిని గుర్తిస్తే వెంటనే పశువైద్యులను సంప్రదించాలి.
>
> – డాక్టర్ జి.శ్రీరామ్ రవికిరణ్, వెటర్నరీ వైద్యుడు, కడియం

ఆల్బెండజోల్ మాత్రలపై అవగాహన

కంబాలచెరువు: విద్యార్థుల్లో రక్తహీనతకు కారణం నులిపురుగులేనని రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌ఎస్‌బీకే) జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్ అన్నారు. స్థానిక నెహ్రూనగర్ నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో బుధవారం డీవార్మింగ్ మాత్రలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలు మట్టిలో ఎక్కువగా ఆడతారని, దాని ద్వారా నులిపురుగులు శరీరంలోకి చేరి జీర్ణమైన ఆహారాన్ని శరీరానికి అందకుండా చేస్తాయన్నారు. ఏడాదికి రెండుసార్లు, ఫిబ్రవరి 10, ఆగస్టు 10న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నారన్నారు. అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ మాట్లాడుతూ అన్ని యాజమాన్యాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి జిల్లా ఆరోగ్య సంస్థ అన్ని ఏర్పాట్లూ చేసిందన్నారు.

అందరికీ ధన్యవాదాలు

ప్రకాశం నగర్: జిల్లాలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు అని టీడీపీ జిల్లా నాయకులు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు జవహర్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజానగరం నియోజకవర్గం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొన్నారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

సీటీఆర్ఐ: ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శమని ఆదివాసీ ఉద్యోగ సంక్షేమ పరిషత్ నాయకుడు ముర్రం జగన్‌బాబు అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని అన్ని తెగల సంస్కృతులు, సంప్రదాయలు, ఆచార వ్యవహారాలు, అలవాట్లు, కట్టుబాట్లను ఆదివాసీలు కాపాడుకుంటూ వస్తున్నారన్నారు. పంచభూతాలకు హాని కలగకుండా జీవిస్తున్న ఆదివాసీలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సోడే మురళి, మర్మం పాపారావు పాల్గొన్నారు.

యుద్ధాలతో అభివృద్ధికి విఘాతం

కంబాలచెరువు: యుద్ధాల కారణంగా దేశాల అభివృద్ధికి విఘాతం కలుగుతుందని జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు డాక్టర్ చైతన్య శేఖర్, కన్వీనర్ ఎం.మల్లికార్జునరావు అన్నారు. స్థానిక ఆనంద నగర్ మున్సిపల్ హైస్కూల్లో బుధవారం ప్రధానోపాధ్యాయులు బీఏ శాంతకుమారి అధ్యక్షతన నాగసాకి డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండో ప్రపంచ యుద్ధ కాలంలో 1945 ఆగస్టు 6న జపాన్‌లోని హీరోషిమాపై, ఆగస్టు 9న నాగసాకిపై అణుబాంబులు వేశారన్నారు. క్షణాలలో వేలమంది మరణించారని, తదుపరి రోజులలో రేడియేషన్ కారణంగా సుమారు నాలుగు లక్షల మంది మృతి చెందారన్నారు. ఇప్పటికీ ఆ ప్రాంతాల్లో ఆ బాంబుల తాలూకు విషప్రభావం కొనసాగుతూనే ఉందన్నారు. సైన్సు రెండు వైపులా పదునున్న కత్తి వంటిదని, దాన్ని విచక్షణతో వాడుకుని, మానవాళి అభివృద్ధికి దోహదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వీఎస్ సూర్యం, ఎన్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- పొట్టిలంకలో గడపగడపకూ..



పొట్టిలంకలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న చందన నాగేశ్వర్

కడియం: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. పొట్టిలంకలోని వీవర్స్ కాలనీలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సీఎం జగన్ అభివృద్ధి, సంక్షేమాన్ని పారదర్శకంగా ప్రజలకు అందిస్తున్నారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలన్న ఉద్దేశంతోనే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని అందరికీ అందిస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా 550 సేవలను నేరుగా ప్రజలకే అందిస్తున్నారన్నారు. అంతకు ముందు గ్రామంలోని చౌడేశ్వరీదేవి ఆలయాన్ని సందర్శించారు. గ్రామంలోని హౌసింగ్‌కు సంబంధించి అంకం భాగ్యలక్ష్మితో పాటు మరో ముగ్గురికి పేర్లు తప్పుగా నమోదు కావడంతో సంబంధిత పథకం అందలేదని తెలుసుకుని, కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొత్తపల్లి సత్యవతి, వెంకటేశ్వరరావు, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, పార్టీ నాయకులు దాసరి స్వామి, కర్రా ముక్తేశ్వరరావు, తోరాటి మల్లేశ్వరరావు, కామిరెడ్డి రాంబాబు, కామిరెడ్డి కృష్ణ, గట్టి గంగాధర్, నక్కా చంటి, ఊటుకూరి శైలజ, సాకా పట్టాభి, పంచాయతీ కార్యదర్శి బండారు తాతారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ విజేత మోహిత్‌కు సన్మానం



బ్యాడ్మింటన్ క్రీడాకారుడు మోహిత్‌ను సత్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు తదితరులు

ప్రకాశం నగర్: ఏపీ స్టేట్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్ 19 సింగిల్స్, డబుల్స్ విభాగంలో విజేతగా నిలిచిన కొత్తపల్లి శ్రీమోహిత్‌ను బుధవారం స్థానిక ఆనంద్ రీజెన్సీలోని నగర కాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, యర్రా వేణు గోపాలరాయుడు, ఉమా కోటిలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ అరిగెల బాబు, సీసీసీ చానల్ ఎండీ పంతం కొండలరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ మోహిత్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. తండ్రి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి బాలు ప్రోత్సాహంతో మోహిత్ ఇంటర్ చదువుతూ బ్యాడ్మింటన్‌లో రికార్డులు సృష్టించడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నందెపు శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు బొంతా శ్రీహరి, మానె దొరబాబు, బీజేపీ నాయకులు యెనుముల రంగబాబు, ఆడబాల రామకృష్ణ, పురంశెట్టి ప్రసాద్, మురళీ, చవ్వాకుల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రాజవోలులో 'వైఎస్సార్ పొలంబడి'



పొలంబడిలో సూచనలిస్తున్న డీసీఆర్ ఏడీఏ జయరామలక్ష్మి

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు గ్రామంలో మండల వ్యవసాయాధికారి అబ్బిరెడ్డి భీమరాజు ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రిసోర్స్ సెంటర్ ఏడీఏ జయరామలక్ష్మి మాట్లాడుతూ వరి నాటిన 45 రోజులలోపు పురుగులు, తెగుళ్ల ఆశిస్తే, వాటికి మందు కొట్టకుండా భాగస్వామ్య కార్యాచరణ పరిశోధన (పీఏఆర్) ప్రయోగం చేశామన్నారు. ఇందులో భాగంగా ఆకుల కత్తిరింపు, పిలకల తొలగింపు చేసినట్టు తెలిపారు. గతవారం నిర్వహించిన ప్రయోగం వివరాలు ఈ వారం నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. నాటిన 45 రోజులలోపు వరి పంటకు పునరుజ్జీవన శక్తి ఉండటం వల్ల తెగుళ్ల ఆశించినా తిరిగి పునరుత్పత్తి చేసుకుంటుందన్నారు. కాబట్టి ఆకులు, పిలకలు నష్టపోయినా కోలుకుంటుందన్నారు. కార్యక్రమంలో పొలంబడి రైతులు, వ్యవసాయ విస్తరణాధికారి పీటర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు దుర్గబాబు, పుష్ప, వీఏఏలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌ను విస్మరించిన చంద్రబాబు

కంబాలచెరువు: పిల్లనిచ్చిన మామ, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావును మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విస్మరించారని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి పీవీవీఎస్‌బీ రాజు అన్నారు. తన కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. 14 ఏళ్లపాటు అధికారంలో ఉన్న చంద్రబాబు తన మామ ఎన్టీఆర్ పేరును ఏఒక్క జిల్లాకు ఎందుకు పెట్టలేక పోయారని ప్రశ్నించారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టారన్నారు. కుటుంబంపై, ప్రజలపై చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు ఎలాంటి ప్రేమ, అభిమానం ఉండవన్నారు. సీఎం జగన్ మానవీయ దక్పథంతో ఉంటారని, రాజమహేంద్రవరంలో సాయం కోరివచ్చిన ముగ్గురికి వెంటనే రూ.లక్ష వంతున ఆర్థిక సాయం అందించారన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర, పవన్ కల్యాణ్ వారాహి యాత్ర ద్వారా ఏం సాధిస్తున్నారన్నారు.

పరిమి రామస్వామి మృతి తీరని లోటు

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ రైతు విభాగం నాయకుడు పరిమి రామస్వామి మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. బుధవారం ఆయన కోలమూరులో రామస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కోలమూరులో ఇటీవల మృతి చెందిన ముప్పిడి కొండయ్య కుటుంబసభ్యులను నాగేశ్వర్ పరామర్శించారు. అనారోగ్యానికి గురై కోలుకొంటున్న కొంతమూరుకు చెందిన సోమన శ్రీనివాస్‌ను, ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న పార్టీ నాయకుడు కొల్లి బాబీని పరామర్శించారు.

11 నుంచి డీసెట్ రెండో విడత కౌన్సెలింగ్

రాజమహేంద్రవరం రూరల్: డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సులో చేరేందుకు డీసెట్–2023లో అర్హత పొందిన అభ్యర్థులకు రెండో విడత కౌన్సెలింగ్ జరుగుతుందని ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణాసంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎస్‌డీవీ రమణ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చని, ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకూ సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. 17న ప్రొవిజనల్ అడ్మిషన్ లెటర్లు జారీ చేస్తామన్నారు. 17 నుంచి 20వ తేదీ వరకు బొమ్మూరులోని డైట్‌లో ప్రొవిజనల్ అడ్మిషన్ లెటర్‌లో సూచించిన తేదీల్లో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్‌కు హాజరుకావాలన్నారు. తగిన ఫీజు చెల్లించి ఫైనల్ అడ్మిషన్ లెటర్ తీసుకుని సంబంధిత కాలేజీలో చేరాల్సి ఉంటుందన్నారు.

ఉత్సాహంగా 'నా భూమి - నా దేశం'



హుకుంపేటలో శిలాఫలకం వద్ద వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నా మట్టి – నా దేశం, నేలతల్లికి నమస్కారం – వీరులకు వందనం కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. రూరల్ మండలం పిడింగొయ్యి, హుకుంపేట పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాలకు ఏపీజీఅండ్‌బీసీ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రూరల్ ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు ఎం.రూప్‌చంద్, జి.వెంకటరావు, ఉపాధి ఏపీవో బి.వెంకట సత్యవతి, హుకుంపేట సొసైటీ అధ్యక్షుడు బొప్పన సుబ్బారావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు కురుమళ్ల ఆంజనేయులు, పిడింగొయ్యిలో మాజీ ఎంపీటీసీ కందిరెల్ల సత్తిబాబు, చీరా రాజు, మద్దిల రమణ, పంచకట్ల నాగేశ్వరరావు, అల్లంపల్లి శ్రీనివాస్, తీగిరెడ్డి శ్రీనివాస్, కాండ్రేగుల సత్తిబాబు, కవులూరి చంటిబాబు, జాజుల శ్రీను, పల్లెటి చిన్నబాబు, హుకుంపేటలో పసలపూడి శ్రీనివాస్, గణేష్, షేక్ మీరావలి, నేమాల సుశీల, బీదం రాజు, నాగు, పేరూరి శేషాద్రి పాల్గొన్నారు.

రూ.3.50 లక్షలకు టోకరా

కంబాలచెరువు: స్థానిక సుబ్బారావుపేటకు చెందిన ఎం.జగదీష్ ఆన్‌లైన్‌లో బిట్ క్వాయిన్లు కొనుగోలు చేస్తూ రూ.3.50 లక్షలు మోసపోయిన సంఘటనపై ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నెల రెండో తేదీన జగదీష్ వాట్సాప్ ఒక మెసేజ్ వచ్చింది. దాన్ని క్లిక్ చేయగా అతడికి రూ.2 వేలు విలువ చేసే కాయిన్ వచ్చింది. దానికి మరో కాయిన్ కొంటే రూ.800 వస్తుందని చెప్పారు. దీంతో ధపధపాలుగా పలుమార్లు క్వాయిన్లు కొనుగోలు చేశాడు. ఈ ప్రక్రియ ఈనెల ఎనిమిదో తేదీ వరకూ నిర్వహిస్తూ వచ్చాడు. ఈ విధంగా మొత్తం రూ.3.50 లక్షలు వేశాడు. తర్వాత క్వాయిన్లు రావడం ఆగిపోయాయి. దీంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బాలికకు ప్రసవం.. బిడ్డ మృతి

కంబాలచెరువు: స్థానిక ఇసుక వీధికి చెందిన బాలికకు బాబీ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అతడు బాలికను నమ్మించి మాయమాటలు చెప్పి మోసం చేశాడు. దీంతో ఆమె గర్భవతి అయ్యింది. ఈ నేపథ్యంలో ఆమెకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఆమె పరిస్థితి విషయంగా ఉండడంతో కాకినాడ తరలించారు. అక్కడ వైద్యులు ఆ బాలికకు ప్రసవం చేశారు. అయితే ఆమెకు పుట్టిన బిడ్డ మరణించింది. దీనిపై ఆసుపత్రి సమాచారం మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతి అదృశ్యం

ధవళేశ్వరం: గ్రామంలోని ఎఫ్‌సీఐ ప్రాంతానికి చెందిన వై.శిరీష రాజమహేంద్రవరంలోని దుస్తుల షాపులో పనిచేస్తోంది. ఈ నెల 7వ తేదీన షాపునకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో బంధువులు అన్ని చోట్లా గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో బుధవారం ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ఎం.కేశవరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో వ్యక్తి మృతదేహం

ధవళేశ్వరం: గ్రామంలోని సున్నంబట్టీ వీధిలో గోదావరి ఒడ్డుకు వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చింది. ఆ మృతదేహం కాతేరుకు చెందిన గంగిన శ్రీనివాస్ (48)గా పోలీసులు గుర్తించారు. అతడు రెండు రోజులుగా కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొవ్వూరులో మిస్సింగ్ కేసు నమోదు అయ్యిందన్నారు. మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై క్రాంతి కుమార్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.


ఐదు నామినేషన్లు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని ఖాళీ అయిన 22 వార్డు మెంబర్ల ఎన్నికకు సంబంధించి రెండో రోజు బుధవారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా పంచాయతీ అధికారి జి.సత్యనారాయణ తెలిపారు. ఇప్పటి వరకూ మొత్తం ఎనిమిది నామినేషన్లు వచ్చాయి.

అంకితభావంతో పనిచేస్తే చిరస్థాయి గుర్తింపు

రంగంపేట: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తే విద్యార్థుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి అన్నారు. ఇటీవల ఉన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులకు వీడ్కోలు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సభకు అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధించి మంచి ఫలితాలు సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయుల మేలు ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన విజయభారతి, కృష్ణారెడ్డి, వెంకటలక్ష్మి, సుమబాల, కమలప్రశాంతి, నాగలక్ష్మిలకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.

సినిమాలు



శ్యామల	జైలర్
సూర్యమినీ	సూర్యసన్‌ఆఫ్‌కృష్ణన్
సూర్యప్యాలెస్	మెగ్–2
స్వామి	బ్రో
శివజ్యోతి	బిజినెస్‌మేన్
అనుశ్రీ	బ్రో
రాజా	జైలర్
అశోక	జైలర్
ఊర్వశి	జైలర్
రంభ	రాజుగారికోడిపలావు
మేనక	కృష్ణగాడుఅంటేఒకరేంజ్, ప్రియమైనప్రియ
అప్సర	బేబీ

నామవరం

వీఎస్ మహల్	జైలర్

ధవళేశ్వరం

మురళీకృష్ణ	జైలర్

కడియం

వెంకటసూర్య	జైలర్